క్లుప్తంగా

ఇబ్బందులకు గురిచేస్తే పోలీసులకు తెలియజేయాలి

లక్సెట్టిపేట: ఆకతాయిలు ఇబ్బందులకు గురిచేస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని షీ టీం ఇన్‌చార్జి ఎస్సై హైమ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ఎవరైనా చెడుగా మాట్లాడినా, ప్రవర్తించినా వారి తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా 100కు డయల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో షీ టీం సభ్యులు శ్రావణ్, సతీశ్, జ్యోతి, కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్షయను నిర్మూలించాలి

దండేపల్లి: క్షయ వ్యాధిని నిర్మూలించాలని దండేపల్లి పీహెచ్‌సీ వైద్యుడు సతీశ్ అన్నారు. దండేపల్లి, మండలంలోని చింతపల్లిలో గురువారం టీబీ ముక్త భారత్ కార్యక్రమం నిర్వహించారు. క్షయ నిర్మూలన, నివారణ చర్యలను గురించి వివరించారు. అనంతరం క్షయ అనుమానిత వ్యాధిగ్రస్తులకు తెమడ పరీక్షలతో పాటు, ఎక్స్‌రేలు తీశారు. కార్యక్రమంలో వైద్యుడు గౌరీ శంకర్, సీహెచ్‌వో రాజారెడ్డి, సూపర్‌వైజర్ వసంతకుమారి, సిబ్బంది రాధిక, మనీషా, లక్సెట్టిపేట ఆరోగ్య కేంద్రం టీబీ సూపర్‌వైజర్ సురేష్, అంజన్న పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మించాలి

నస్పూర్: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సంగమల్లయ్య పల్లె వద్ద గల వాగుపైన బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ సీపీఎం నాయకులు గురువారం కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గోమాస ప్రకాష్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు తాత్కాలిక వంతెన తెగి పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మిడివెల్లి రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఏడీఈకి సన్మానం



సన్మానిస్తున్న దండేపల్లి సెక్షన్ ఉద్యోగులు

దండేపల్లి: 79వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా లక్సెట్టిపేట ఏడీఈ ప్రభాకర్‌రావు ఈనెల 15న వరంగల్‌లో ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ పురస్కారం అందుకున్నారు. ఈసందర్భంగా దండేపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయంలో సెక్షన్ విద్యుత్ ఉద్యోగులు గురువారం ఏడీఈని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఈ బాపు, సబ్ ఇంజినీర్ సాయి, ఎస్ఎల్ఐ నరసయ్య, ఎల్ఐ గౌస్, లైన్‌మెన్‌లు నాగన్న, మల్లేశ్, శ్రీధర్, సామెల్, శేఖర్, ఏఎల్ఎంలు పాల్గొన్నారు.

పశువులు రోడ్డుపై సంచరించకుండా చూడాలి



ఎస్సైకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జన్నారం: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై రాత్రిపూట పశువులు సంచరించకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం ఎస్సై అనూషకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దాసరి గణేశ్ మాట్లాడుతూ పశువులు రాత్రిపూట రోడ్లపై పడుకుంటున్నాయని, వాటిని గమనించని వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. అధికారులు స్పందించి రోడ్లపై పశువులు లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు సాయినాయక్, నాయకులు వినీత్, రఘు, రాకేశ్, సుమీత్, సాయిరెడ్డి, బన్ని, పూర్ణచందర్ పాల్గొన్నారు.

వర్తక సంఘం కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

రామకృష్ణాపూర్: బీజోన్ వర్తక సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆడెపు కృష్ణకుమార్, ప్రధాన కార్యదర్శిగా కొండ కుమార్, కోశాధికారిగా దేవేందర్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా గోక శ్రీనివాస్, ప్రచార ప్రతినిధిగా పరికిపండ్ల రాజు, గౌరవాధ్యక్షుడిగా గంగాజలం, సలహాదారులుగా ఆడెపు లక్ష్మణ్, వెంగళదాసు సత్యనారాయణ, బత్తుల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా గుండా రమేశ్, నారాయణరెడ్డి, సతీశ్, శ్రీనివాస్, మల్లేశ్‌ను ఎన్నుకున్నారు.

ఒకే భవనం.. రెండు కార్యాలయాలు

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి పక్కా భవనం కరువు
- ఇబ్బందుల్లో క్రయ విక్రయ దారులు



పంచాయతీరాజ్ శాఖ భవనంలో కొనసాగుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

లక్సెట్టిపేట: 'అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' అన్నట్లు ఉంది మండల కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిస్థితి. కోట్ల రూపాయల ఆదాయం ఉన్నా కార్యాలయానికి సొంత భవనం లేదు. దీంతో కొంతకాలం శిథిలావస్థలో ఉన్న పాత ఆస్పత్రి భవనంలో, ఆ తర్వాత పంచాయతీ రాజ్ శాఖ కార్యాలయ భవనంలో కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయానికి వచ్చిన వారికి కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. బాత్‌రూం, ఇతర మౌలిక సదుపాయలు లేక అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం, అధికారులు సొంత భవనంపై దృష్టి పెట్టకపోవడంతో ఇరుకు భవనంతో ఇక్కట్లు పడుతున్నారు.

సొంత భవనం కరువు

మండల కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సొంత భవనం కరువైంది. లక్సెట్టిపేట, దండేపల్లి, జన్నారం, కాసిపేట మండలాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్‌లు ఇక్కడే నిర్వహిస్తారు. కార్యాలయం పరిధిలో ఒక మున్సిపాలిటీ, 99 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. సంవత్సరానికి సుమారు రూ.3 కోట్ల ఆదాయం వస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. పదేళ్ల క్రితం కార్యాలయానికి పక్కా భవనం కోసం పట్టణంలో పది గుంటల స్థలాన్ని కేటాయించగా ఇప్పటికీ ఎలాంటి పనులు ప్రారంభించలేదు. రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్ లేకపోవడంతో కొంతకాలంగా ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌లతో కాలం వెల్లదీస్తున్నారు. పంచాయతీరాజ్ శాఖ కార్యాలయ భవనంలో నాలుగు గదులు ఉన్నాయి. ఒకగదిని పంచాయతీరాజ్ అధికారులు వాడుకుంటుండగా మిగతా భవనం మొత్తం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికే కేటాయించారు. దీంతో పీఆర్ విధులకు ఆటంకం కలుగుతోంది. ఉన్నతాధికారులు వస్తే అవస్థలు పడుతూ ఇరుకు గదిలో విధులు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా కార్యాలయాన్ని సబ్ రిజిస్ట్రార్ అధికారులు శుభ్రంగా ఉంచడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. ఒకే భవనంలో రెండు కార్యాలయాలు ఉండడంతో ఎవరు వస్తున్నారు? ఎవరు వెళ్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వారికి అత్యవసర పరిస్థితి వస్తే ఎటూ వెళ్లలేని పరిస్థితి. సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి పక్కా భవనం నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

పక్కా భవనం నిర్మించాలి

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కోసం పదేళ్ల క్రితం తహసీల్దార్ కార్యాలయం ఎదుట పది గుంటల స్థలం కేటాయించారు. ఇప్పటికీ పనులు ప్రారంభించలేదు. కార్యాలయానికి పక్కా భవనం ఉంటే బాగుంటుంది. అన్ని సౌకర్యాలు ఉంటాయి. బాత్‌రూం, టాయిలెట్‌లు లేకపోవడంతో కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పక్కా భవన నిర్మాణం చేపట్టాలి.

– సాయికుమార్, ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్, లక్సెట్టిపేట

మంత్రి సీతక్కను కలిసిన నాయకులు



మంత్రి సీతక్కతో గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు

జైపూర్: గిరిజన ఉద్యోగుల సంఘం సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు ధరావత్ పంతులనాయక్, జనరల్ సెక్రెటరీ భూక్య నాగేశ్వర్‌రావు గురువారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా క్లస్టర్, ఇంటర్ క్లస్టర్ ప్రమోషన్లలో అన్యాయం జరుగుతుందని, రోస్టర్ రిజిస్టర్ వెరిఫికేషన్, ప్రమోషన్ పాలసీకి సంబంధించిన అంశాలు త్వరిగతిన పరిష్కారం కావాలని కోరారు. కార్యక్రమంలో చీఫ్ లైజన్ ఆఫీసర్ కృష్ణయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోత్ దశరథ్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మోకాళ్ల తిరుమల్‌రావు, జీఎం సివిల్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ రాజేశ్‌కు అరుదైన అవకాశం



డాక్టర్ రాజేశ్ బుర్కుండే

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నగరంలోని టచ్ ఆస్పత్రిలో కార్డియాలజిస్టుగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ రాజేశ్ బుర్కుండే 2026 మే 4, 5 తేదీలలో మలేషియాలోని కౌలాలంపూర్‌లో జరిగే 4వ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ కార్డియాలజీ అండ్ కార్డియోవాస్క్యులర్ రీసెర్చ్‌కు స్పీకర్‌గా ఎంపికయ్యారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వైద్య నిపుణులు పాల్గొననున్న సదస్సుకు భారతదేశం తరఫున డాక్టర్ రాజేశ్ పాల్గొని ప్రసంగించనున్నారు. టచ్ ఆసుపత్రిలో పలు క్లిష్టమైన ప్రొసీజర్స్‌ను విజయవంతంగా పూర్తిచేసి ఎంతోమంది ప్రాణాలు కాపాడగా అత్యాధునిక అడ్వాన్స్‌డ్, క్యాత్‌ల్యాబ్ ద్వారా అనేక మందికి హృదయ సంబంధిత అత్యవసర సేవలు అందించినట్లు ఆయన పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

జైపూర్: వేలాలకు చెందిన ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుందిళ్ల మల్లేశ్ తల్లి శంకరమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ గురువారం పరామర్శించారు. టీపీసీసీ రాష్ట్ర నాయకుడు పేర్క శ్యామ్, ఎమ్మార్పీ ఎస్ జిల్లా ఇన్‌చార్జి లింగంపల్లి శ్రీనివాస్, సమ్మయ్య, జలంపల్లి శ్రీనివాస్, చిప్పకుర్తి మల్లేశ్, సతీశ్ పాల్గొన్నారు.

కాసిపేట: ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి కల్వల శరత్ తండ్రి లక్ష్మణ్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బాధిత కుటుంబాన్ని సోమగూడెంలోని వారి స్వగృహంలో మంద కృష్ణ మాదిగ కలిసి పరామర్శించారు. ఆయన వెంట ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య ఉన్నారు.

ఎమ్మెల్సీ అంజిరెడ్డికి ఘనస్వాగతం



అంజిరెడ్డిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

తాండూర్: పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డికి బీజేపీ నాయకులు గురువారం ఘనస్వాగతం పలికారు. అనంతరం శాలువాతో సత్కరించారు. జీవో 49 రద్దు చేయాలని, పోడు భూముల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు చేస్తున్న సత్యాగ్రహ దీక్షకు అంజిరెడ్డి సంఘీభావం తెలిపేందుకు వెళ్తూ మార్గమధ్యలో తాండూర్ మండలంలో ఆగి బీజేపీ నాయకులను కలిశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల హేమాజీ, జిల్లా అధికార ప్రతినిధి శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా ఉపాధ్యక్షుడు పులుగం తిరుపతి, మండల అధ్యక్షుడు భరత్ కుమార్, సీనియర్ నాయకులు చిలువేరి శేషగిరి, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్సీ

పాతమంచిర్యాల: నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్ నియోజక వర్గ పట్ట భద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కుమార్ దీపక్‌ను మర్యాద పూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. ఆయన వెంట బీజేపీ నాయకులు ఉన్నారు.

నవరాత్రులు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి



బెల్లంపల్లిరూరల్ : మాట్లాడుతున్న ఏసీపీ రవికుమార్

మందమర్రిరూరల్: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని బెల్లంపలి ఏసీపీ రవికుమార్ సూచించారు. మందమర్రి పోలీస్‌స్టేషన్ ఆవరణలో సీఐ శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమావేవంలో ఎస్సై రాజశేఖర్, ఏఎస్సై శ్రీనివాస్, హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు, ఇతర మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

తాండూర్: వినాయక చవితిని పురస్కరించుకొని గ్రామాల్లో ఏర్పాటు చేసే గణేశ్ మండపాలకు పోలీసు శాఖ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సీఐ ఎన్.దేవయ్య సూచించారు. గురువారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో శాంతి కమిటీ స మావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు వినాయక చవితి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై డి.కిరణ్‌కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్, ట్రాన్స్‌కో ఏఈ జాన్, నాయకులు గణేశ్, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్న గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసరావు దేశ్‌పాండే, మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్ నిర్వాహకులకు సూచించారు. గురువారం శ్రీనివాస గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన శాంతికమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎస్సై స్వరూప్‌రాజ్, నిర్వాహకులు పాల్గొన్నారు.

నెన్నెల: వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని బెల్లంపల్లి రూరల్ సీఐ హనోక్ అన్నారు. గురువారం పోలీస్‌స్టేషన్‌లో శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. విద్యుత్ శాఖ అనుమతులు తీసుకోవాలని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. సమావేశంలో ఎస్సై ప్రసాద్, మండపాల నిర్వాహకులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నస్పూర్: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని శ్రీరాంపూర్ ఎస్సై సంతోష్ సూచించారు. శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్‌లో శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మండపాలకు అనుమతి తప్పనిసరి

భీమిని: గణేశ్ మండపాలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని కన్నెపల్లి ఎస్సై భాస్కర్ అన్నారు. పోలీస్ స్టేషన్‌లో మండపాల నిర్వహకులకు అవగాహన కల్పించారు.

బెల్లంపల్లిరూరల్: నవరాత్రి ఉత్సవాలను ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని బెల్లంపల్లి ఏసీపీ ఏ.రవికుమార్ అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన శాంతికమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో కె.శ్రీనివాసరావు, ఎస్సై జి.రాకేష్ పాల్గొన్నారు. తాళ్లగురిజాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో బెల్లంపల్లి రూరల్ సీఐ సీ.హెచ్ హనోక్, ఎస్సై బి.రామకృష్ణ, నిర్వాహకులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతు చేయాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మంచిర్యాలటౌన్: ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న మంచిర్యాల నగరంలోని రోడ్లు, డ్రెయినేజీలకు మరమ్మతు చేయడంతో పాటు, పారిశుద్ధ్య పనులు చేపట్టాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. హైటెక్‌సిటీ కాలనీ, చున్నంబట్టివాడ, సూర్యనగర్, హమాలివాడ, బృందావనం కాలనీల్లో దెబ్బతిన్న రోడ్లను గురువారం పరిశీలించారు. అనంతరం కమిషనర్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ అంకం నరేశ్, నాయకులు ఎర్రం తిరుపతి, తోట తిరుపతి, ఎడ్ల శంకర్, తాజుద్దీన్, గోగుల రవీందర్‌రెడ్డి, ఒడ్నాల రవీందర్, పడాల రవి, కర్రు శంకర్, వెంకటసాయి, మహమ్మద్ రఫీ, బల్లికొండ రమేశ్, గంగులు, పెంట ప్రదీప్, పెంట నవీన్, సమ్మయ్య, శేఖర్, మాసు శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

భూతగాదాలతో మహిళపై దాడి

కాసిపేట: మండల కేంద్రానికి చెందిన పోలవేణి స్వరూపపై గురువారం భూత గాదా విషయంలో పలువురు దాడికి పాల్పడిన ఘటన చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు బాధితురాలు స్వరూపపై పోలవేణి తిరుపతి, రాజేశ్వరి, పోలవేణి లచ్చన్న సత్యవతి, పోలవేణి పోశం మల్లేష్ గడ్డపారతో దాడి చేసి గాయపరచినట్లు తెలిపారు. ఈ విషయంలో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధిత మహిళ పేర్కొంది.

బహుమతుల ప్రదానోత్సవం విజయవంతం చేయాలి

నస్పూర్: ఈ నెల 30న నిర్వహించనున్న బహుమతుల ప్రదానోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం శ్రీనివాస్ అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతీ విభాగం అధికారులు వారికి కేటాయించిన పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం ఎస్.సత్యనారాయణ, అధికారులు భీబాత్స, సాంబశివరావు, ఏవీ రెడ్డి, చిప్ప వెంకటేశ్వర్లు, కుర్మ రాజేందర్, రవికుమార్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు మొక్కల పంపిణీ



మొక్కలు పంపిణీ చేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ రాజమనోహర్

మంచిర్యాలటౌన్: 'ఒక మార్పు అభివృద్ధికి మలుపు' అనే నినాదంతో చేపడుతున్న కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ బి.రాజమనోహర్ గురువారం విద్యార్థులకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కరుణాకర్, శానిటరీ సూపర్‌వైజర్ లింగాల కుమారస్వామి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వైకుంఠం, రెవెన్యూ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ ప్రశాంత్, మున్సిపల్ వార్డు ఆఫీసర్‌లు, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మార్గరేట్ విగ్ జయంతి



మాట్లాడుతున్న ధనుంజయరెడ్డి

రామకృష్ణాపూర్: ఐదు దశాబ్దాల పాటు విద్య, వైద్య రంగంలో ఎంతో మంది పేదలకు విశిష్ట సేవలు అందించిన సంఘ సేవకురాలు మార్గరేట్ విగ్గమ్మ 103వ జయంతిని మందమర్రి మండలం బొక్కల గుట్టలోని హెవెన్ ఆఫ్ హోప్ హైస్కూల్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెవెన్ ఆఫ్ హోప్, ఔట్‌రీచ్ మ్యాప్ నిర్వాహకులు పాల్ విగ్, కెరోలిన్ విగ్, సుశీల, ధనుంజయరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సత్యాగ్రహ దీక్షకు మద్దతు



దీక్షలో పాల్గొన్న బీజేపీ నాయకులు

బెల్లంపల్లిరూరల్: గిరిజనుల జీవనాన్ని దెబ్బతీస్తున్న జీవో 49 రద్దు కోసం నాలుగు రోజులుగా సత్యాగ్రహ దీక్ష చేపడుతున్న సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబుకు బెల్లంపల్లి బీజేపీ నాయకులు గురువారం మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజీ, జిల్లా ఉపాధ్యక్షుడు పులగం తిరుపతి, కార్యదర్శి గోవర్ధన్, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ రాచర్ల సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మోదీ పాలనను ఇంటింటికీ తెలియజేయాలి

దండేపల్లి: ప్రధాని మోదీ పాలన గురించి ఇంటింటికీ తెలియజేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు రవిగౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం మండల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలన్నారు.

తాత్కాలిక ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం

తాండూర్: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల లబ్ధిదారుల ఆధార్ కార్డుల్లో తప్పుల సవరణ కోసం కలెక్టర్ ఆదేశాల మేరకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో తాత్కాలిక ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సేవలు అందుబాటులో ఉంటాయన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనుల పరిశీలన

తాండూర్: మండలంలోని కొత్తపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులను గురువారం ఎంపీడీఓ శ్రీనివాస్, ట్రాన్స్‌కో ఏఈ జాన్ పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ శ్రీనివాస్ మండల కేంద్రంలోని వ్యాపార వాణిజ్య సముదాయాన్ని పరిశీలించారు.

కేబుల్ వైర్లు సరిచేసుకోవాలి

లక్సెట్టిపేట: ఇంటర్నెట్, కేబుల్ వైర్ల ఆపరేటర్‌లు కేబుల్ వైర్లను సరిచేసుకోవాలని విద్యుత్‌శాఖ ఏడీ ప్రభాకర్ అన్నారు. విద్యుత్ స్తంభాలకు ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేసిన కేబుల్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయని, వాటిని సరిచేసుకోవాలన్నారు. అనంతరం పలు ప్రదేశాల్లో కేబుల్ వైర్లను సరిచేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ గణేష్, సిబ్బంది సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నా విజయవంతం చేయాలి

మంచిర్యాలఅర్బన్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ స్టీరింగ్ సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో యూఎస్‌పీసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు గడిచినప్పటికీ సమస్యలు పరిష్కరించలేదన్నారు. ఈనెల 23న హైదరాబాద్‌లో తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సభ్యులు చక్రపాణి, రాజావేణు, రమేశ్, జయకృష్ణ, సంజీవ్, మనోజ్ పాల్గొన్నారు.

బెల్లంపల్లిరూరల్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఈ నెల 23న హైదరాబాద్‌లో చేపట్టనున్న మహాధర్నా విజయవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.చక్రపాణి, రాజావేణు కోరారు.

గుడిపేటలో 'పొలంబాట'

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుడిపేటలో గురువారం విద్యుత్ అధికారులు పొలంబాట నిర్వహించారు. మండల విద్యుత్ ఇన్‌చార్జి ఏఈ శిరిషా, లైన్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్ ఆధ్వర్యంలో వంగిన విద్యుత్ పోల్స్‌ను సరిచేయడం, వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేసి రైతులకు సంబంధించి విద్యుత్ సమస్యలు పరిష్కరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

భీమారం: మండలంలోని మద్దికల్, పోతన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులు నిర్వహించేందుకు టీచర్లతో పాటు ఆయా పోస్టులకు అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో గోపాల్‌రావు కోరారు. 18 నుంచి 44 సంవత్సరాల లోపు మహిళా అభ్యర్థులు అర్హులని, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఐదు సంవత్సరాలు, దివ్యాంగులకు పదేళ్లు వయో సడలింపు ఉంటుందన్నారు. టీచర్ పోస్టుకు ఇంటర్, ఆయా పోస్టుకు ఏడోతరగతి చదివి ఉండాలన్నారు. ఈ నెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ప్రగతి స్టేడియంలో ఈ నెల 30న నిర్వహించనున్న 55వ వార్షిక రక్షణ బహుమతుల ప్రదానోత్సవ వేడుకల్లో తినుబండరాల స్టాల్స్ ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తి గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సింగరేణి యాజమాన్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 25లోగా జీఎం కార్యాలయంలోని పర్సనల్ విభాగంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

నెన్నెల: గంగారాం, మెట్‌పల్లి ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ స్కూల్స్ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని ఎంఈవో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. వాటిలో పని చేసేందుకు అంగన్‌వాడీ ఇన్‌స్ట్రక్టర్స్, ఆయా పోస్టుల కోసం అర్హులైన అభ్యర్థులు ఈనెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

వేమనపల్లి: భారీ వర్షాల నేపథ్యంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యాధికారులు రాజేశ్, అన్వేష్ సూచించారు. గురువారం కళ్లంపల్లి, ముక్కిడిగూడం గ్రామాల్లో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జ్వరపీడితుల నుంచి రక్తనమూనాలు సేకరించారు. హెల్త్ అసిస్టెంట్ లింగయ్య, ఏఎన్ఎం రాజ్యలక్ష్మి, ఆశ కార్యకర్త సరిత పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

వేమనపల్లి: సీఎంఆర్ఎఫ్ నిధి పేదలకు వరమని మాజీ జెడ్పీటీసీ సంతోష్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాబీర్ ఆలీ అన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన 14 మంది బాధితులకు గురువారం రూ.8 లక్షల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ లింగాగౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, వైస్ ఎంపీపీ రాజన్న, నాయకులు జాహెద్‌అలీ, అదె శంకర్, గాలి మధు, తోకల రాంచందర్, కిష్టయ్య, రమేశ్, భగవంత్ పాల్గొన్నారు.

వయో వృద్ధుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి

పాతమంచిర్యాల: వయో వృద్ధుల భద్రత, ఆరోగ్యంపై ప్రభుత్వం దృష్టి సారించాలని తెలంగాణ బలహీన వర్గాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మోతే రాజలింగు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వృద్ధాశ్రమాలు, డేకేర్ సెంటర్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయమై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

భీమిని: కన్నెపల్లి మండలంలోని రైతు వేదికలో బెల్లంపల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నర్సింగరావు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రామాంజనేయులు, వైస్ ఎంపీపీ రాకేశ్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.